రెట్టింపు అభివృద్ధి చేసి చూపుతా..

- మరోసారి అవకాశమివ్వండి..
- ఆత్మీయ సమావేశంలో అరెకపూడి గాంధీ

హుడా కాలనీలో జరిగిన ఆత్మీయ సమావేశంలో కాలనీవాసులతో విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, అక్టోబర్ 25: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ నగర్ ఫేస్ 5తో పాటు హుడా కాలనీ లో స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీకి మద్దతుగా బుధవారం స్థానిక కాలనీ వాసులతో కలిసి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో శేరిలింగంపల్లిలో ఎన లేని అభివృద్ధి చేసి చూపడం జరిగిందని, మరో సారి ఆశీర్వదించి గెలిపించినట్లయితే రెట్టింపు అభివృద్ధి చేసి చూపుతానని స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత బాధ్యతతో పార్టీని బలోపేతం చేసి ముందుకు తీసుకువెళ్తానని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టడానికి నా వంతు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఇప్పటి వరకు రూ.9 వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేయడం జరిగిందని, అందరి ఆశీస్సులతో, సహకారంతో రాబోయే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచి మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బంగారు సాధనకు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. మహిళలు, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన కేసీఆర్ అని అన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణను ఆదర్శంగా తీసుకుంటు పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా అధికారులు చక్కటి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు ఎప్పటికప్పుడు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకొని, ఎక్కడ పనులు ఆపకుండా ఎన్నో స్థల సేకరణ చేయాల్సి ఉన్నప్పటికి కూడా ప్రజల సహకారం తీసుకొని అధికారులను సమన్వయం పరుచుకుంటు ఇన్ని రోడ్లు అభివృద్ధి చేయడం బహుశా 50 ఏండ్ల చరిత్రలో మొట్టమొదటిదని చెప్పారు. శేరిలింగంపల్లిలో బ్రహ్మాండంగా ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు, కోత్త రోడ్లు వేయడం జరిగిందని అన్నారు. ప్రజలకు సుఖవంతమైన రవాణా వ్యవస్థను కల్పించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. శేరిలింగంపల్లి ప్రజలు నాపై విశ్వాసంతో ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించగలరని కోరారు. అనంతరం స్థానిక ప్రజలు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మా పూర్తి స్థాయి మద్దతు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకేనని అన్నారు. ముచ్చటగా మూడోసారి అత్యధిక ముజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలో తిరుగులేని మెజార్టీని ఇచ్చి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా అందిస్తామన్నారు. భారీ మెజార్టీతో గులాభి జెండా ఎగురవేసి అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

7.10 లక్షలకు చేరిన శేరిలింగంపల్లి ఓటర్లు

నూతన ఓటు దరఖాస్తుకు ఈ నెల 31 వరకు గడువు..

నియోజకవర్గ ఆర్‌వో కార్యాలయం

మియాపూర్, అక్టోబర్ 25 : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ముమ్మర ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించగా..పోలింగ్ కేంద్రాలు, డీఆర్‌సీ, కౌంటింగ్ కేంద్రం, రాజకీయ పక్షాలతో సమావేశాలు తదితర ప్రక్రియలను నియోజకవర్గ ఎన్నికల అధికారులు చేపడుతున్నారు. ఈనెల మొదటి వారంలో ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితాను ప్రకటించిన విషయం విదితమే. దాని ప్రకారం నియోజకవర్గం 6,98,078 ఓటర్ల సంఖ్య ఖరారైంది. తుది ఓటర్ల జాబితాను ప్రకటించినప్పటికీ నవంబర్ 30 న ఎన్నికలు జరగనుండటంతో.. ఈ నెల చివరి వరకు కొత్త ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీంతో ఓ వైపు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లతో పాటు నూతన ఓటు నిమిత్తం దరఖాస్తు చేసుకోవాలనే అంశంపై నియోజకవర్గంలో అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు వేలల్లో నూతన దరఖాస్తులు అధికారులకు అందాయి. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో తగు విచారణను పూర్తి చేసి అర్హతను బట్టి అనుమతులను ఇస్తున్నారు. తద్వారా ఇప్పటి వరకు నియోజకవర్గంలో 7,10,693 కు ఓటర్ల సంఖ్య చేరింది. ఇంకా 5600 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆన్‌లైన్ ద్వారా రోజుకు నియోజకవర్గ వ్యాప్తంగా 500 వరకు నూతన ఓటు దరఖాస్తులు అందుతున్నాయి. ఈ నెల 31 వరకు నూతన ఓటు నమోదు నిమిత్తం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. voters.eci.gov.in దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెలాఖరు వరకు దరఖాస్తుకు అవకాశం ఉండగా.. నియోజకవర్గ ఓటర్ల సంఖ్య సుమారు 7.20 లక్షలకు చేరువలోకి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా నియోజకవర్గవ్యాప్తంగా 622 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే వాటిల్లో కనీస వసతుల కల్పనకు కసరత్తులు చేస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో పోలింగ్ మెటిరియల్ పంపిణీ స్వీకరణ కేంద్రంతో పాటు కౌంటింగ్ కేంద్రం సైతం ఏర్పాటైంది. తద్వారా నియోజకవర్గ ఓట్లు ఇక్కడే లెక్కించనున్నారు. అత్యధిక ఓటర్ల సంఖ్యలో ఇప్పటికే రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన శేరిలింగంపల్లి కొత్తగా చేరనున్న ఓట్ల తదుపరి సైతం తన స్థానాన్ని పదిలం చేసుకోనున్నది. నూతన ఓటరు దరఖాస్తుకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉన్నందున ఇప్పటికీ నమోదు చేసుకోని వారు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి రజనీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

విజువల్ ఆర్ట్స్ సృజనాత్మకతకు దోహదం

ఖైరతాబాద్, అక్టోబర్ 25 : విజువల్ ఆర్ట్స్ పిల్లలకు సృజనాత్మకత పెంచుతుందని నటి, రచయిత, ఇండ్ ఫేమ్ నీతూవో గీతాభాస్కర్ దాస్యం తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఇండియా ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్‌కేజీ నుంచి ఏడో తరగతి వరకు విద్యార్థులకు నేర్పించేందుకు చిత్రకళల ప్రత్యేక కోర్సును రూపొందించామన్నారు. ఆరు నెలల కోర్సును ఉపాధ్యాయులకు అందిస్తామని, తద్వారా విద్యార్థులకు సైతం చేరుతుందన్నారు. ఆ దిశగా తాము కార్యాచరణ తయారు చేసుకున్నామన్నారు.

సమావేశం వివరాలు వెల్లడిస్తున్న గీతా భాస్కర్

సామాజిక భద్రత కల్పించాలి

హిమాయత్‌నగర్,అక్టోబర్ 25: రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వశక్తితో ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి,కొత్త ఆటోలకు పర్మిట్లు ఇవ్వాలని కోరారు.అసంఘటిత రంగ కార్మికులుగా ఉన్న ఆటో డ్రైవర్స్‌కు సామాజిక భద్రత కల్పించి, ఆటో,క్యాబ్ మీటర్ చార్జీలు పెంచాలని విజ్ఞప్తి చేశారు.గ్రేటర్ ఆటోలకు తగినన్ని పార్కింగ్ స్థలాలు ఇవ్వడంతో పాటు పెరిగిన ఇన్సూరెన్స్ ధరలను తగ్గించాలని కోరారు.

అమ్మవారికి పూజలు

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి ఆశీర్వాదం తీసుకొని ప్రత్యేక పూజలు చేసిన విప్, ఎమ్మెలే అరెకపూడి గాంధీ

– మాదాపూర్, అక్టోబర్ 25

దుర్గం చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

మాదాపూర్, అక్టోబర్ 25: తండ్రితో గొడవపడి తీవ్ర మనస్థాపం చెందిన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారంలో నివాసం ఉంటున్నసంపత్ కుమార్ (45) క్యాబ్ డ్రైవర్‌గా చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన తండ్రికి సంపత్ రావుకు మధ్యలో క్యాబ్ విషయమై గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్థాపంతో ఈ నెల 25వ తేదీన ఉదయం మాదాపూర్‌లోని దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంపత్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కంపెనీలో కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బంపడు తలెత్తి ఉండవచ్చన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. సంపత్‌కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నట్లు తెలిపారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

హిమాయత్‌నగర్,అక్టోబర్ 25: దేశంలోని యువజనుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఏఐవైఎఫ్ 2వ మహాసభలు ఈ నెల 29,30 తేదీల్లో హిమాయత్‌నగర్‌లోని తెరా పంత్ భవన్‌లో వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

REQUIRED STAFF

CIVIL ENGINEER
- Should be a B.E. (Civil) or Diploma in Civil Engineering with more than 5 years experience having sound understanding of Building Construction.
- Should be well conversant in project planning, cost control and quality monitoring.

ACCOUNTANTS
- Minimum B Com. Role entitles handling of day-to-day accounts, books keeping, banking, bill passing, taxation, audit assistance. Experience of working on Tally & ERP counts

FEMALE RECEPTIONIST
- Graduate with fluent in English, Hindi & Telugu. Well Groomed with good communication and interpersonal skills

FEMALE TYPIST
- With hi speed computer typing. Should have good grasp of English, Candidate is required to draft Various types of documents in English and also experience in MS Office, Word & Excel is a must.

OFFICE EXECUTIVE
- Any Graduate with knowledge & experience of office administration & Field work for a minimum of 5 years.

INTERVIEW TIMINGS :
10:00 am to 12:30 pm on FRIDAY 27-10-2023 at Our Office

Gupta Realty - Since 1998
A Team of Real Estate Professionals
Flat No.110, Vibhavari Towers, Huda Trade Centre, Seri Lingampally, Hyderabad-500 019.
Cell : 9346188061 / 9866188061
Email: guptarealtytelangana@gmail.com
Website : guptarealty.com